వైభవంగా వెండి మొక్కుజోడు సేవ

స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 23 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామికి వెండి మొక్కు జోడు సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి మండపంలో ఊరేగించారు. జోడు సేవలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజ రూప దర్శనంలో స్వయంభూ నారసింహ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి ప్రధానాలయం ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. సుమారు 4వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.9,62,992 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదుగాలి : మున్సిపల్ చైర్మన్

ఆర్వీల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, జూలై 23 : మహిళలు ఆర్థికంగా ఎదుగాలని మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆర్వీల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల్లో ఆర్థిక స్వావలంబన రావాలని, మహిళలందరూ ఆర్థికంగా ఎదుగాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి స్కీమ్ తీసుకొచ్చిందన్నారు. పట్టణంలో మహిళలకు ఐదు కోట్ల రూపాయలు బ్యాంకుల ద్వారా రుణ సహాయం చేసి వ్యాపారం చేయించాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇందిరా క్యాంటిన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, గృహ సేవ, కోల్డ్ స్టోరేజ్, క్యాటరింగ్ సర్వీసెస్, ఫుడ్ ప్రాసెసింగ్, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్, టెంట్ హౌస్, బ్యూటీ పార్లర్ వంటి సర్వీసెస్‌పై ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, మెప్మా సిబ్బంది శ్యామల, రిసోర్స్ పర్సన్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పుట్టపాకలో మెగా వైద్య శిబిరం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి

సంస్థాన్ నారాయణపురం, జూలై 23 : పుట్టపాక అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా పుట్టపాక గ్రామంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఎంఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్స్ సహకారంతో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, ఎంఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ మర్రి వసంత, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు పుల్లారావు ప్రారంభిచారు. ఈ సందర్భంగా దాదాపు 300 మందికి గుండె, గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, కంటికి సంబంధించిన టెస్టులు చేసి మందులు అందజేశారు. ఎంఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుట్టపాకలో ప్రతి ఏడాది రక్తదాన శిబిరం, విద్యార్థులకు నోట్ బుక్స్, ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ప్రజలకు ఎంఎన్ఆర్ ట్రస్ట్ మరిన్ని సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దోనూరి నర్సిరెడ్డి, రైతు సంఘం సీనియర్ నాయకులు సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, దొంతగాని పెద్దులు, సీనియర్ జర్నలిస్ట్ మర్రి మహేందర్‌రెడ్డి, ఎంఎన్ఆర్ ట్రస్ట్ సెక్రెటరీ మర్రి మనోహర్‌రెడ్డి, గాలయ్య, చంద్రశేఖర్, అమరేందర్, నరసింహ, నాగరాజు పాల్గొన్నారు.

చేనేత పరిరక్షణ మహా ర్యాలీని జయప్రదం చేయండి

కర పత్రాన్ని ఆవిష్కరిస్తున్న చేనేత నాయకులు

భూదాన్ పోచంపల్లి, జూలై 23 : పట్టణంలో నేతన్న విగ్రహం నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు ఈ నెల 25న ఉదయం 10:30 గంటలకు నిర్వహించే చేనేత పరిరక్షణ మహా ర్యాలీని విజయవంతం చేయాలని టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ అన్నారు. పట్టణంలోని టై అండ్ డై అసోసియేషన్ భవనంలో చేనేత పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌగోళిక గుర్తింపు పొందిన చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలన్నారు. వారసత్వంగా వస్తున్న చేనేత కలను ప్రభుత్వం ఆదుకోవాలని, వస్త్ర నిల్వలను కొనుగోలు చేసి కార్మికులకు పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టై అండ్ డై అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కర్నాటి బాలరాజు, చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, కొండా లక్ష్మణ్ బాపూజీ కాంప్లెక్స్ మార్కెట్ చైర్మన్ గుండు శ్రీరాములు, సిల్క్ యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు సురపల్లి రవీందర్, నాయకులు యాదగిరి, దశరథ, రమేశ్, శంకరయ్య, భవానీశంకర్, బాలరాజు, యాదగిరి, నీలమ్మ పాల్గొన్నారు.

'గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి'

బొమ్మలరామారం, జూలై 23 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మర్యాల, జలాల్‌పూర్, కాజీపేట, బోయిన్‌పల్లి, రంగాపూర్, తూముకుంట తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మర్యాల గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పాండు మాట్లాడుతూ గ్రామాల్లో కోతులు, కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వర్షాకాలంలో దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కోరారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, గ్రామ శాఖ కార్యదర్శి మధు, నాయకులు వెంకటేశ్, బాలయ్య, దేవేందర్, శంకరయ్య, శ్రీపతి రామయ్య, వెంకయ్య, భాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ కృష్ణయ్య

ఆత్మకూరు(ఎం), జూలై 23 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కృష్ణయ్య అన్నారు. మండలంలోని మొరిపిరాల గ్రామంలో సైబర్ నేరాలు, మూఢనమ్మకాలపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు.

గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందివ్వాలని సూచించారు. దొంగతనాలను అరికట్టేందుకు గ్రామ యువకులు జట్లుగా ఏర్పడి గస్తీ తిరుగాలన్నారు.

రైతుల రుణమాఫీకి సహకరించాలి

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి పోచంపల్లి బ్యాంకు చైర్మన్ వినతి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ రమేశ్

భూదాన్ పోచంపల్లి, జూలై 23 : పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో రుణం తీసుకున్న రైతులకు మాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్ మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీలో కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులను చేర్చలేదన్నారు. పోచంపల్లి బ్యాంకులో 95 మంది రైతులు రూ.66,24,135 పంట రుణం పొందారని తెలిపారు. గతంలో ప్రభుత్వం రుణమాఫీ చేసినప్పుడు బ్యాంకు నుంచి రుణం పొందిన రైతులకు మాఫీ వర్తించిందని తెలిపారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులందరికీ రుణమాఫీ చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బండారు ప్రకాశ్‌రెడ్డి, పోచంపల్లి బ్యాంక్ వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ కొండమడుగు ఎల్లస్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

భూదాన్ పోచంపల్లి : ముక్తాపూర్‌లోని మట్టిపల్లి భాగ్యలక్ష్మి వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్ఓసీని హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలన్నారు.

'దళిత డిక్లరేషన్‌పై బడ్జెట్ సమావేశాల్లో స్పష్టత ఇవ్వాలి'

సమావేశంలో మాట్లాడుతున్న రాహచంద్రయ్య

భువనగిరి అర్బన్, జూలై 23 : చేవెళ్ల దళిత డిక్లరేషన్‌పై రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో స్పష్టత ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక ప్రగతి నిధి సమగ్రంగా అమలు చేయాలని దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన చేవెళ్ల దళిత డిక్లరేషన్ ప్రకారం ఎస్సీలకు 18, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణానికి అంబేద్కర్ అభయ హస్తం పేరుతో రూ.6లక్షలు విడుదల చేయాలని కోరారు. అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు, కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు కంపెనీల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ప్రజా పర్యవేక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అన్నంపట్ల కృష్ణ, విజిలెన్స్ కమిటీ సభ్యుడు బర్రె సుదర్శన్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుతాడి సురేశ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్, దళిత సంఘాల నాయకులు సాయి, దాసు, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమ ఆడబిడ్డ సునీతను విమర్శించడం సిగ్గుచేటు

- బీఆర్ఎస్ రాజాపేట మండలాధ్యక్షుడు తిరుమలేశ్

రాజాపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుమలేశ్

రాజాపేట, జూలై 23 : తెలంగాణ ఉద్యమ ఆడబిడ్డ, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు విమర్శించడం సిగ్గు చేటని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీర్ల ఐలయ్య ఎమ్మెల్యేగా గెలిచి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు గెలిపిస్తే తన పదవిని స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్నాడని ఆరోపించారు. ఐలయ్య గెలిచినప్పటి నుంచి ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. అక్రమంగా వెంచర్లు చేయడంతో అందులో ప్లాట్ కొనుగోలు చేసిన బాధితులు మోసపోయి లబోదిబోమంటున్నారన్నారు. ఆయన మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. కాంగ్రెస్ రాగానే కరువు వచ్చి ఎంతో మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు పొంది మంత్రి పదవి దక్కించుకోవాలని కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఆలేరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందాలే తప్ప.. చిల్లర మల్లర విమర్శలు చేసి కాలయాపన చేయొద్దని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, మదర్ డెయిరీ డైరెక్టర్ చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూడి భాస్కర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, స్వామి, వెంకటేశం, వీరేశం, జశ్వంత్, ధర్మేందర్‌సింగ్, సురేశ్, ఉప్పలయ్యగౌడ్, గోపిరెడ్డి, రాజు, కరీం, భాస్కర్, నర్సిరెడ్డి, కనకయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు : ఎస్ఐ మల్లయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ మల్లయ్య

రామన్నపేట, జూలై 23 : యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ పి.మల్లయ్య అన్నారు. మండలంలోని మునిపంపుల గ్రామంలో భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్యాలు, మూఢనమ్మకాల నిర్మూలన – విద్యార్థులు, యువకుల పాత్ర'పై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తుకు బానిస అయితే కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. విద్యార్థి దశలో బాగా చదివి ఉన్నత ఉద్యోగాలు సాధిస్తే కుటుంబం బాగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఐత విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, నాయకులు చంద్రశేఖర్, ఆండాలు, శ్రీనివాస్, జితేందర్, రమేశ్ పాల్గొన్నారు.

'చేనేతకు రూ.1200 కోట్లు కేటాయించాలి'

మోత్కూరు, జూలై 23 : చేనేత కార్మికుల సంక్షేమం, పరిశ్రమ పరిరక్షణకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు నేసిన బట్టలు అమ్మకాలు లేక, చేయడానికి పనులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కరువై, అవస్థలు పడుతున్నారని తెలిపారు. చేనేత స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కోరారు.

కిందపడి గాయపడిన వృద్ధుడి మృతి

రామన్నపేట, జూలై 23 : ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కక్కిరేణి గ్రామానికి చెందిన మచ్చ బాలసంతు (86) ఈ నెల 20న గ్రామంలోని తన ఇంటి ముందు అదుపు తప్పి కింద పడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. గాయాలకు ఇతర ఆరోగ్య సమస్యలు తోడు కావడంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పి.మల్లయ్య తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి : సీపీఎం

భువనగిరి కలెక్టరేట్, జూలై 23 : మండలంలోని నందనం గ్రామం నుంచి సిరివేణి కుంటకు వెళ్లే దారిలో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ అన్నారు. ఈ మేరకు మంగళవారం నందనం గ్రామ పంచాయతీ కార్యదర్శి షబానాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు కింది రైతులు వెళ్లే దారిలో పెరిగిన కంపచెట్లను తొలగించాలన్నారు. ఇల్లు లేని పేదలందరికీ స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అర్హత కలిగిన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామంలో దోమలు నివారణకు ఫాగింగ్ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండాపురం యాదగిరి, వెంకటేశ్, సిద్దిరాజు, లక్ష్మిరెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత ఇవ్వడం అభినందనీయం

ఆలేరు రూరల్, జూలై 23 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు చేయూత ఇవ్వడం అభినందనీయమని మండలంలోని కొలనుపాక జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు లింగేశ్వర్‌రావు అన్నారు. పాఠశాల గ్రౌండ్ క్లీన్ చేయుటకు, ఆగస్టు 15కు సంబంధించిన ఆటల పోటీల బహుమతులు అందజేయుటకు ముందుకు వచ్చిన ఎస్ఏఎఫ్ తవక్కల్ ఫౌండేషన్ చైర్మన్ అస్లామొద్దీన్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగరాజు, మహేశ్, క్రాంతి, బాలనారాయణ, స్వామి, ఉమర్, నవీన్, అన్వర్ పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి

- వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ
- పలు మండలాల్లో పోలీసులకు ఫిర్యాదు

చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 23 : ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగుల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధరణికోట నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎందరో దివ్యాంగులు విభిన్న ప్రతిభను కనబరిచి చరిత్ర పుటల్లోకి ఎక్కిన సంఘటనలు స్మితా సబర్వాల్ మరువరాదన్నారు. దివ్యాంగుల సమాజానికి స్మితా సబర్వాల్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌కే షబ్బీర్, జిల్లా సభ్యులు మచ్చ ఉపేందర్, అయిలయ్య, రమేశ్, రజిత, పద్మ, శ్రీను , సామాజిక కార్యకర్త వెంకటేశ్ పాల్గొన్నారు.

సబర్వాల్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చౌటుప్పల్/ రామన్నపేట, జూలై 23 : దివ్యాంగులను కించపరిచిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు చౌటుప్పల్, రామన్నపేట పోలీస్ స్టేషన్లలో మంగళవారం ఫిర్యాదు చేశారు. దివ్యాంగులపై వివక్ష చూపి అవమానపరిచిన ఆమెపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, నాయకులు బలుగూరి ఆంజనేయులు, సంజీవ శంకర్, యాదగిరి, యాదమ్మ, లింగస్వామి, పరశురాం, కృష్ణ, చంద్రమౌళి పాల్గొన్నారు.

పోస్టు చేయడం బాధాకరం

భువనగిరి అర్బన్ : దివ్యాంగులను కించపరిచే విధంగా ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ట్విట్టర్‌లో పోస్టు చేయడం బాధాకరమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు స్వరూపంగ ప్రకాశ్ అన్నారు. పట్టణంలో ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఎవరి సొత్తు కాదన్నారు. అనంతరం భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో స్మితా సబర్వాల్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ కొత్త లలిత, నాయకులు వెంకటేశ్‌యాదవ్, జహంగీర్ పాల్గొన్నారు.

మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణికి శుభాకాంక్షలు

శోభారాణికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ సర్పంచ్ దామోదర్ గౌడ్

బొమ్మలరామారం, జూలై 23 : తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బండ్రు శోభారాణిని మర్యాల మాజీ సర్పంచ్ కుర్మిండ్ల దామోదర్‌గౌడ్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ముద్దం ఉదయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్

గ్రంథాలయంలో వసతులను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

భువనగిరి అర్బన్, జూలై 23 : పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భగా గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులతో మాట్లాడి వారికి కావాలసిన వసతులు, పుస్తకాలను తెలుసుకొని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రెటరీ సుధీర్, నాయకులు సలావుద్దీన్, శెట్టి బాలయ్య, అవేస్ చిస్టీ, మజహర్, అతహర్, తయార్, సాయి కిరణ్, స్వామి పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి

- ఏడీఏ జ్యోతి

రైతుల శిక్షణలో మాట్లాడుతున్న ఏడీఏ జ్యోతి

భువనగిరి కలెక్టరేట్, జూలై 23 : రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి ధాన్యం నిల్వల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ పి.జ్యోతి అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసే గిడ్డంగులు, నిల్వ ఉంచే ధాన్యంపై రుణాలు అనే అంశంపై మండలంలోని బొల్లెపల్లి రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణలో ఆమె మాట్లాడారు. ధాన్యం నిల్వ సమయంలో ఆశించే చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గోదాముల్లో నిల్వ చేసే ధాన్యంపై 4నుంచి 7శాతం రుణం పొందే అవకాశం ఉన్నదని, మంచి ధర వచ